ప్రజాశక్తి

మంగళవారం 30 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉపాధి రక్షణకు ఉద్యమం

◆ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

◆ అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కూలీలకు జీవనోపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే మోడీ ప్రభుత్వ దుశ్చర్యలను పోరాటాల ద్వారా అడ్డుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. బడ్జెట్‌లో నిధుల కోత పెట్టడంతో వ్యవసాయ కూలీల పనిదినాలు తగ్గి, పనుల కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితి రానుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు సంయుక్తంగా అనకాపల్లి కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన

ధర్నాలో మాట్లాడుతున్న లోకనాథం

మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపర్చాలన్న ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పాత పద్ధతిలో సమ్మర్ అలవెన్స్, మస్టర్ విధానం, ఇతర అలవెన్స్‌లు, పనిముట్లు వ్యవసాయ కూలీలకు అందజేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు తగినట్లు కూలి పెంచేందుకు బడ్జెట్‌లో మిగతా 2లో..

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో జూన్‌లో జరగబోయే పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు విశాఖ జిల్లాలో మొత్తం 24 సెంటర్లలో 5981 మంది విద్యార్థులు మిగతా 2లో..

వివాహిత దారుణ హత్య

▶ వార్త 5లో..

రెజ్లర్లకు విశాల మద్దతు

లైంగిక వేధింపులకు పాల్పడ్డ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీలో ఉద్యమిస్తున్న మహిళా రెజ్లర్లపై ఆదివారం జరిగిన పైశాచిక దాడిని ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. రెజ్లర్ల పోరాటానికి మద్దతు తెలుపుతూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

విశాఖలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

విశాఖ కలెక్టరేట్ : సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ సింగ్ హోటల్ జంక్షన్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ భారతదేశ ప్రతిష్టను కుస్తీ పోటీల్లో విశ్వవ్యాప్తం చేసిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలంటూ నూతన పార్లమెంట్ భవనం ఎదుట నిరసనకు యత్నించిన రెజ్లర్లపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్బంధకాండ ప్రయోగించడం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఉపాధి రక్షణకు ఉద్యమం

నిధులు పెంచకపోగా, రూ.30 వేల కోట్లు కోతపెట్టడం దారుణమన్నారు. ధనంతులకు బిజెపి ప్రభుత్వం రాయితీలు కల్పించి, పేదల ఉపాధి చట్టంపై దాడి చేస్తోందన్నారు. రోజుకు ఆరు వందల రూపాయల కూలి ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ ఉపాధి చట్టం రక్షణ కోసం కూలీలంతా పోరాడాలన్నారు. ఉపాధి కూలీలకు పనిదినాలు తగ్గించి, మేట్ల వ్యవస్థను రద్దు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం బాధపెడుతోందన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు

ఉపాధి కూలీల ధర్నా శిబిరం వద్దకు డిఆర్‌ఒ వెంకటరమణ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్ వచ్చారు. కూలీలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను నాయకులు వారికి వివరించి వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డిఆర్‌ఒ, పీడీ హామీ ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి కూలీలు ఈ ధర్నాకు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, గోవింద, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము, కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, దేముడునాయుడు, సోమినాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి జి.నాయినిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి మాణిక్యం, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు విశాల మద్దతు

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, సిఐటియు కార్యకర్తలు

దేనికి సంకేతమని ప్రశ్నించారు. రెజ్లర్లను, వారికి మద్దతు తెలిపిన మహిళా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ బిజెపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ న్యాయం చేయాలని కోరిన వారిపై దాడి చేయడం హేయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రమణి, వి.కృష్ణారావు, పివిఎస్‌బి.శ్రీనివాసరాజు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా, సిఐటియు నిరసన

ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడారు. మహిళా మల్ల యోధులు తమపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని చెప్పినా బిజెపి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. మహిళా రెజ్లర్లను బహిరంగంగా తక్కువ చేసి మాట్లాడటం, వారి ఫిర్యాదులను రాజకీయం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎ.పుష్పాంజలి సాహు, కె.లక్ష్మి, సుజాత, సుమిత్ర, పద్మ, కుమారి పాల్గొన్నారు.

అనకాపల్లి : మహిళా రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మహిళా రెజ్లర్లపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మన్ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ మహిళా రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడి వేధింపులకు గురి చేశాడని, దీనిపై జనవరిలోనే ఫిర్యాదు చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుత్తల శంకరరావు, జి.కోటేశ్వరరావు, నాయకులు ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.గోవిందరావు, యువజన సంఘం నాయకులు సోమునాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లిలో నిరసన చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఐపిఎ సబ్ కమిటీ రిపోర్టు దగ్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిడబ్ల్యుఎన్‌సిపై కార్మిక వ్యతిరేక ఐపిఎ సబ్ కమిటీ రిపోర్టును రద్దు చేయాలంలూ సోమవారం పోర్టు ఎఒబి వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఐపిఎ సబ్ కమిటీ రిపోర్టును సిఐటియు అనుబంధ యునైటెడ్ పోర్టు అండ్ డాక్ పాంప్లాయీస్ యూనియన్, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ ద్వైపాక్షిక వేతన సంప్రదింపుల కమిటీలో యాజమాన్యం నుంచి 13 మంది, ట్రేడ్ యూనియన్ నుంచి 13 మంది ఉంటారన్నారు. మేజర్ పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు ధరల పెరుగుదలకు అనుకూలంగా ఎంత జీతం ఉండాలో ఈ కమిటీలో నిర్ణయం చేస్తారన్నారు. అటువంటి కమిటీని కాదని ఐపిఎ యాజమాన్యం ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీ వేసిందన్నారు. కార్మికుల పక్షాన ఉన్నవారు లేకుండా యాజమానులతోటే ఈ సబ్ కమిటీ వేయడం చట్ట వ్యతిరేకమన్నారు. సబ్ కమిటీల పేరుతో 2022 జనవరి 1 నుంచి అమలు కావాల్సిన వేతన ఒప్పందాన్ని వాయిదాలు వేస్తున్నారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ విధానాలు ఎంతటి దుర్మార్గమైనవో వివరించారు. పోర్టు కార్మికులకు హాని తలపెట్టే చర్యలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ పోర్టు డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, సిహెచ్.త్రినాథ్,రెడ్డి, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, గణేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టు ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించిందని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07165 హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు జూన్ 6, 13, 20, 27 తేదీలలో ప్రతి మంగళవారం రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి ఉదయం 09.05.గంటలకు దువ్వాడ చేరుకుని, 09.07కి బయలుదేరి సాయంత్రం 5.45కి కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు కటక్ నుంచి జూన్ 7, 14, 21, 28 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 10.30 గంటలకు కటక్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.37 గంటలకు బయలుదేరి రాత్రి 09:00 గంటలకు హైదరాబాద్ వెళుతుంది. ఈ రైళ్ళు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్డు, చత్రోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన గ్రాడ్యుటీ, ఇపిఎఫ్ పెన్షన్, సరెండర్ లీవ్ సెటిల్‌మెంట్ వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎపిఎస్ ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.భాను బాబు, గౌరవ అధ్యక్షులు వి.తులసీరామ్ మాట్లాడారు. ఆర్‌టిసిలో డ్రైవర్, కండక్టర్, మెకానిక్, హెల్పర్లుగా విధులు నిర్వహించి 2020 నుంచి 2021 డిసెంబర్ 31 మధ్య రిటైర్మెంట్ అయినవారికి నేటికీ బెనిఫిట్స్ అందజేయలేదన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలన్నారు. తమకు ఇహెచ్‌ఎస్ కార్డుతో వైద్యం అందేలా, ఆర్‌టిసి డిస్పెన్సరీలోనూ వైద్యం అందేలా చూడాలన్నారు. తెల్లరేషన్ కార్డు, వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగులు

రైల్వే పాఠశాలను తొలగించొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దొండపర్తి రైల్వే కాలనీ (వైర్‌లెస్ కాలనీ)లో చిరకాలంగా కొనసాగుతున్న రైల్వే స్కూలును అక్కడి నుండి తొలగించాలనే నిర్ణయం దారుణమని, ఈ ప్రతిపాదనను రైల్వే శాఖ విరమించుకోవాలని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం, పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.లక్ష్మీనారాయణ, కెవి.రమణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి..) హాజరవుతారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష జరుగు గంట ముందుగా మాత్రమే పరీక్షా కేంద్రం తెరవబడుతుందని, పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు వరకు మాత్రమే అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనికి ప్రవేశ అనుమతి ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, డిజిటల్ పరికరాలు అనుమతించబడవన్నారు. ప్రతి ఒక్కరినీ విధిగా తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను, ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 163 విజ్ఞప్తులు అందాయి. కలెక్టర్ మల్లికార్జున బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన స్పందనకు 43 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ డాక్టర్ సిఎం.త్రివిక్రమ వర్మ బాధితుల కష్టాలను తెలుసుకున్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ నిర్వహించారు. 84 వినతులు అందాయి.

యుపిఎస్‌సి సెమినార్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరగబోయే యుపిఎస్‌సి సెమినార్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని విశాఖపట్నం సిటీ లా అండ్ ఆర్డర్ డిసిపి వి.విద్యాసాగర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. సెమినార్ పోస్టర్‌ను అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అభిమన్యుతో కలిసి తన కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ప్రవర్తనే భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు. యుపిఎస్‌సి పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు ఈ సెమినార్ సరైన మార్గనిర్దేశకం కాగలదని తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ సెమినార్‌కు సంబంధించిన మరిన్ని వివరాలకు 9315014015 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రాజన్న ఆటోనగర్ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్మార్ట్ విశాఖ ఆటో పార్ట్ అండ్ స్క్రాప్ డీలర్స్ అసోసియేషన్‌కి రాజన్న ఆటోనగర్ పేరుతో ఆనందపురం మండలం కనమం గ్రామంలో సర్వే నెంబర్ 50లో కేటాయించిన 150.77 ఎకరాల స్థలంలో తక్షణం నిర్మాణ పనులు ప్రారంభించాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి కర్రి గణేష్, సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి మాట్లాడారు. కేటాయించిన స్థలానికి రాజన్న ఆటోనగర్‌గా నామకరణం చేసి నాలుగేళ్లు అయినా అప్పగించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

In The Court Of The Hon'ble IInd Addl. Senior Civil Judge :: Kakinada
O.S.No. 136/2022

Between:
P.Srihari ...*Plaintiff*
AND
1) Velugula Vijayalakshmi
2) Tirumalasetti Kondalarao
3) M.V.Maheswararao @ Dorababu ...*Defendants*

TO: Defendants:
1) Velugula Vijayalakshmi, S/o. Veerabhadrarao, R/o. D.No. 45-57-2/1/12, Flat No. F.S.No.1, Anusha Residency, Narasimha Nagar, Visakhapatnam.
2) Tirumalasetti Kondalarao, S/o. Balaram, R/o. D.No. 48-23-12, Anu Residency, Narasanna Nagar, Visakhapatnam.
3) M.V.Maheswararao @ Dorababu, S/o. Chakrarao, R/o. D.No. 48-23-12, Anu Residency, Narasanna Nagar, Visakhapatnam.

Please take notice that the above suit filed by Plaintiff against all of you stands posted to **13-06-2023 for your appearance in person or through your counsel at 10:30 A.M. before the above Hon'ble Court.** Falling which the matter shall be decided by the Hon'ble Court in your absence as per law.

//By Order Of The Hon'ble Court//
MOIN KHAN, Advocate, Kakinada. Cell: 98480 33576

స్పందనకు 4 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్‌కు పలు సమస్యలపై 4 అర్జీలు అందాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2, యుసిడి, ప్రజారోగ్యానికి సంబంధించి చెరొక అర్జీలు అందాయి. స్పందనలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు

లంక జేమ్స్ మృతి

ప్రజాశక్తి -ఆనందపురం: భీమిలి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, వేములవలస సర్పంచ్ భర్త లంక జేమ్స్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆయన భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు జేమ్స్ భౌతికయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. జేమ్స్ భార్య కొండమ్మ వేములవలస సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. జేమ్స్‌కు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. జేమ్స్ తల్లి లంక పైడమ్మ గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. రాజకీయాల్లో చురుకుగా ఉండే జేమ్స్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

'కాస్ట్ అకౌంటెన్సీ కోర్సులతో భవిష్యత్'

ప్రజాశక్తి-సీతమ్మధార : కాస్ట్ అకౌంటెన్సీ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సదరన్ కౌన్సిల్ విశాఖ చాప్టర్ చైర్మన్ కృష్ణమాచార్యులు వెల్లడించారు. అక్కయ్యపాలెంలోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. దీంతో ఏటా మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం సంస్థలో విద్యార్థులు 1000 మంది వరకు ఉన్నారని, వీరికి రెగ్యులర్, ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏటా ఈ కోర్సుల్లో 300 నుంచి 600 మంది ప్రవేశాలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కోర్సు చేసిన వారికి పబ్లిక్ సెక్టార్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాస్ట్ అకౌంటెన్సీ ఫౌండేషన్, ఇంటర్మీడియట్, ఫైనల్ కోర్సులు ఉన్నాయని చెప్పారు. ఈ కోర్సులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ వి.లక్ష్మణరావు, కార్యదర్శి జి.రామలింగారెడ్డి, కోశాధికారి హిమబిందు, సభ్యులు శిరీష, నరేంద్ర, వెంకటేష్, సంపత్ కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ తహశీల్దార్‌గా ఆనంద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహశీల్దార్‌గా ఆనంద్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతవరకు పెందుర్తి తహశీల్దార్‌గా పనిచేశారు. అర్బన్ తహశీల్దార్‌గా ఇంతవరకు పనిచేసిన శ్యాంప్రసాద్ పెందుర్తి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆనంద్‌కుమార్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పారు.

ఎసిబికి చిక్కిన విఆర్ఒ

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ రూరల్ విఆర్ఒ జామి రాము రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఎసిబి ఎసిపి శ్రావణి గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయంలో విలేకర్లకు వివరించారు. గోపాలపట్నం పరిధి బుచ్చిరాజుపాలెంలో 22ఎ లో చేరిన ఇంటి స్థలాన్ని ఆ జాబితా నుంచి తొలగిస్తానని చెప్పి విఆర్ఒ లంచం తీసుకుంటున్నారని తెలిపారు. వన్ టౌన్ ప్రాంతానికి చెందిన 80 ఏళ్ల వృద్ధుకి గోపాలపట్నం పరిధి బుచ్చిరాజుపాలెంలో 22 ఎలో చేరిన ఇంటి స్థలం ఉంది. తనకు ఉన్నతాధికారులు వద్ద మంచి పలుకుబడి ఉందని, సింహాచలం దేవస్థానం ప్రోటోకాల్ డ్యూటీ కూడా చేస్తానని, దీని వల్ల 22 ఎ జాబితా నుంచి ఆ ఇంటి స్థలాన్ని తప్పిస్తానని వృద్ధునికి విఆర్ఒ చెప్పాడు. దీని కోసం రూ. 30 వేలు లంచం డిమాండ్ చేశాడు. అడ్వాన్సుగా రూ.10 వేలు ఇవ్వాలని కోరాడు. బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల ప్లాన్ ప్రకారం... టౌన్ కొత్త రోడ్డు వద్ద ఉన్న విఆర్ఒ రాము ఇంటికి బాధిత వృద్ధుడు వెళ్లి రూ.10 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ఇందులో ఇంకెవరి పాత్ర ఉందేమోనని ఆరా తీస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు సతీష్‌కుమార్, కిషోర్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.50 కోట్లతో గీతం పరిశోధనా కేంద్రాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : శాస్త్ర పరిశోధనలను బలోపేతం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.50 కోట్లతో పరిశోధనా కేంద్రాలను అభివృద్ధి చేస్తోందని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం తెలిపారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యాన సోమవారం నుంచి నిర్వహిస్తున్న నూతన ఆధ్యాపకుల అవగాహన తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోధనతో పాటు పరిశోధనలలోను విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో అధ్యాపకులు బోధనా పద్ధతులను విద్యార్థులకు తగిన విధంగా మార్చుకోవాలని సూచించారు. అధ్యాపకులలో అంకిత భావం, నూతన అంశాలను నేర్చుకోవాలన్న తపన అవసరమన్నారు. గీతం విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, లా, పారామెడికల్ కోర్సులు, వైద్య విద్యతో పాటు మానవ అభివృద్ధి శాస్త్రాలను బోధిస్తున్నామని, వీటిలో 48 దేశాలకు చెందిన విదేశీ విద్యార్థులు ప్రవేశాలు పొందారని తెలిపారు.

గీతం అకడమిక్ ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్‌వారియర్ మాట్లాడుతూ, శాస్త్ర విజ్ఞానంలో అంతర్జాతీయంగా జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకునేలా దాదాపు రూ.7 కోట్లతో ఈ-రిసోర్సెస్‌ను గీతం అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు అందుబాటులో ఉంచామన్నారు. కరసెర వంటి ఆన్‌లైన్ కోర్సుల ద్వారా అధ్యాపకులకు నిరంతర శిక్షణ పొందే ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఛాట్ జిపిటి ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.శ్రీకృష్ణ, ప్రొవైస్ ఛాన్సలర్లు ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, ప్రొఫెసర్ డిఎస్.రావు, ప్రొఫెసర్ మోహన్, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ కనకలవారి వీధిలో రూ.1.50 లక్షలతో ఏర్పాటుచేసిన మంచినీటి కుళాయిలను సోమవారం సర్పంచ్ బుగత సన్యాసమ్మతో కలిసి ఎంపిపి కె.రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ, గ్రామాల్లో వేసవిలో విద్యుత్, తాగునీటి సమస్యలు ఉండకూడదన్నారు. కనకలవారి వీధిలో చాలా కాలం నుంచి తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసిన విద్యుత్ సమస్యను పరిష్కరించామని, ఇప్పుడు తాగునీటి సమస్యను కూడా పరిష్కరించామని చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు, ఎంపిపికి ఆ వీధి ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బుగత సత్యనారాయణ, బుగత శ్రీను, కె.ప్రకాష్, కె.సన్యాసినాయుడు, ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో కుళాయిలను ప్రారంభిస్తున్న ఎంపిపి రాంబాబు

వేణుగోపాలస్వామి ఆలయంలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కుచ్చెర్లపాటి లక్ష్మీపతి జ్ఞాపకార్థం వారి కుమారులు శంకరబాబు, శివకుమార్, రామరాజు రూ.80 వేలు ఖర్చుతో బోరు బావిని ఏర్పాటుచేశారు. బోరుబావి ఏర్పాటుకు ముందుగా ఇఒ నానాజీ, పాలకవర్గం అనుమతిని లక్ష్మీపతి కుమారులు తీసుకున్నారు. ఈ కార్యక్రమములో గ్రామ పెద్దలు దేముడుబాబు, ఎం.అప్పలరమణ, ఎ.బ్రహ్మం, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలుకు రఘుపతి వెంకయ్య అవార్డు బహూకరణ

రఘుపతి వెంకయ్య అవార్డు సత్కారం అందుకుంటున్న బాలు

ప్రజాశక్తి-పద్మనాభం : చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ, చారిటబుల్ సేవా ట్రస్టు ఆధ్వర్యాన రఘుపతి వెంకయ్యనాయుడు అవార్డును పద్మనాభం మండలం మద్ది గ్రామానికి చెందిన సామవేదం బాలసుబ్రహ్మణ్యానికి (బాలు) ఆదివారం న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్‌కు చెందిన గోదావరి ఆడిటోరియంలో అందించారు. మద్ది గ్రామానికి చెందిన బాలసుబ్రహ్మణ్యం పురోహితులుగా జీవనం సాగిస్తూ రంగస్థల కళాకారునిగా, కళాసేవకులుగా, నాటక ప్రియులుగా, ఆల్ ఇండియా రేడియో బి హైగ్రేడ్ కళాకారునిగా సేవలందిస్తున్నారు. అనంత పద్మనాభ నాటక కళాకారుల సంఘం వ్యవస్థాపక కార్యదర్శిగా ఉన్నారు. బాలసుబ్రమణ్యం పలు అవార్డులు, డాక్టరేట్‌లు అందుకున్నారు.

వార్డులో ప్రజాసమస్యలడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ రోహిణి

వార్డులో కార్పొరేటర్ రోహిణి పర్యటన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి సాలిపేటలో సోమవారం కార్పొరేటర్ అక్కరమాని రోహిణి పర్యటించారు. మంచినీటి సరఫరా, వీధి దీపాల పనితీరు, చెత్త సేకరణ తదితర విషయాలను స్థానికులనడిగి తెలుసుకున్నారు. కొన్ని చోట్ల ఇనుప స్థంబాలు ఉన్నాయని, అవి చాలా వరకు తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఇనుప స్థంబాల స్థానంలో సిమ్మెంటు స్థంబాలు ఏర్పాటుచేయాలని ఆమె ఆదేశించారు. ఈ పర్యటనలో వైసిపి నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, కొండమ్మ, రాజు, శానిటేషన్, నీటి సరఫరా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : రోడ్డు ప్రమాదాల నివారణపై ఆనందపురం పూల మార్కెట్ వద్ద సుప్ర వాహనం ద్వారా పోలీసులు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. రోడ్డు ప్రమాదాలు వల్ల పలు కుటుంబాల్లోని వ్యక్తులు అనాధలవుతున్నారని, దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం తెలిపారు. కరపత్రాలు, గ్రామాల్లో సమావేశాలు, టెలిస్క్రీన్‌పై ప్రమాదాలు జరుగుతున్న తీరును, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కృష్ణా యూనివర్సిటీ పూర్వపు ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు కోరారు. ఎపిపిసిబి, గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోటీలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి డ్రాయింగ్, వ్యాసరచన, ఎలక్యూషన్, క్విజ్ పోటీలు జరిపారు. "సొల్యూషన్ టు ప్లాస్టిక్ పొల్యూషన్' ఇతివృత్తంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఈయుబి.రెడ్డి మాట్లాడుతూ, ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచానికి ఎంత చేటుగా మారిందో వివరించారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులేసేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. సెంట్ జోసెఫ్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్ డాక్టర్ మేరీ అనుపమ మాట్లాడుతూ, జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిపిసిబి ఎఇ శ్రీలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ టీం కార్యదర్శి జెవి.రత్నం, గ్రీన్ వాలంటీర్లు వి.కిరణ్మయి, ఎంజిలిన్ భాస్కర్, ఎస్ఆర్‌యు, జివిఎంసి ప్రతినిధి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు, డ్రైయిన్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మపేటలోని శ్రీ దుర్గా గణపతి గుడి ఎదురుగా ఉన్న వీధిలో రూ.3.60 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు, డ్రెయిన్లకు స్థానిక కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దాడ యాల్లాజీ, ఎస్.చిన్న, కె.కనకరాజు, బంగారాజు, కాంట్రాక్టర్ పూర్ణచంద్రరావు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న గోవింద్ తదితరులు

పెన్షనర్లు ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి -మాధవధార : కేంద్ర ప్రభుత్వ విధానాలపై పెన్షనర్లు ఐక్యంగా పోరాడాలని హార్డర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు పిలుపునిచ్చారు. మాధవధారలో సోమవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, పోర్టు హాస్పిటల్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని, రోగులకు నాసి రకం మందులు పంపిణీ చేస్తోందని తెలిపారు. రోగులకు సరైన మెడికల్ టెస్టులు నిర్వహించి మంచి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం చౌదరి అప్పారావును సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ సనపల బంగారురాజు, కోశాధికారి అన్నెపు నారాయణరావు, కూన శ్రీనివాసరావు, బీవీ.నాయుడు, జి.భాస్కరరావు, కె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47, 55 వార్డుకు సంబంధించిన వాలంటరీలకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర పురస్కారాలను మాధవస్వామి కల్యాణ మండపంలో అందించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ముఖ్య అతిథిగా హాజరై వాలంటీర్లను సత్కరించి పురస్కారాలను ప్రదానం చేసి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదలకు తక్షణ సహాయం అందేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాలంటరీ వ్యవస్థను ఏర్పాటుచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, కెవిఎన్ శశికళ, రెయ్యి వెంకటరమణ, వార్డు అధ్యక్షులు కెపి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

48వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 48వ వార్డు పరిధి ఎఎస్ఆర్.నగర్, ఇందిరానగర్-5 ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 48వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజాప్రతినిధులే గడపగడపకూ వెళ్లి ప్రజలను కలుసుకొని, సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 48వ వార్డు నాయకులు కర్రి రామారెడ్డి, శ్రీరామ్, కర్రి అప్పారావు, సురేష్, రాము, ఎర్ర శ్రీను, కండిపిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 51వ వార్డులో రూ.43.25 లక్షల వ్యయంతో గాంధీనగర్-1, 2, మహత్‌కాలనీలో బిటి.రోడ్లు, కళింగ నగర్‌లో డ్రెయినేజీ, కాలువల నిర్మాణాలకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పులామాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 47వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, ఎఇ అర్చన, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, 51వ వార్డు నాయకులు పైడి ప్రతాప్, తిరుమలరావు, పప్పల లక్ష్మణ్, అప్పారావు మాస్టర్, శ్యామ్, రత్న, రాణి, వరలక్ష్మి, లత, ధర్మవతి, వినోద్, గణేష్, సాదు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..!

ప్రజాశక్తి-విశాఖపట్నం: జివిఎంసి 44వ వార్డు పరిధిలో ఉన్న సిమెంట్ రోడ్డును గోదావరి వాటర్ పైపులైన్ ఏర్పాటు కోసం తవ్వి మట్టితోనే పూడ్చి వదిలేశారు. దీంతో స్థానికులు ఇబ్బందికి గురవుతున్నారు. ఈ విషయాన్ని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దృష్టికి స్థానిక న్యాయవాది కె.ఈశ్వర్‌ప్రసాద్ తీసుకెళ్లారు. సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించి రోడ్డు వేస్తారని మేయర్ హామీ ఇచ్చి మూడు నెలలైనా స్పందన లేదు. రాత్రి వేళల్లో ఈ రహదారిలో మరింత ఇబ్బందిగా ఉందని, సిమెంట్ రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వి వదిలేసిన రోడ్డు

విఎస్‌జిహెచ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ సిఐటియు నూతన కమిటీని సోమవారం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రకటించారు. అధ్యక్షునిగా పి.అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్ఎన్.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి.వీరస్వామి, వై.సింహాచలం, కార్యదర్శిగా కెఆర్.చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.కుమారి, సంయుక్త కార్యదర్శిగా పి.సుజాత, కమిటీ సభ్యులుగా డి.తాతబాబు, కెఎల్.నాయక్, పివి.ప్రసాద్, ఎన్‌విఆర్ పద్మజ, డి.కృష్ణ, వేణు ఎన్నికైనట్లు సిఐటియు ప్రతినిధులు తెలిపారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తూ బుధవారం విరమణ పొందుతున్న సిఐటియు నాయకులు మోస దానయ్యను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, రిటైర్మెంట్ తర్వాత కూడా కార్మికుల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఉద్యమాన్ని ప్రతి గ్రామంలోనూ నిర్వహించాలని సూచించారు. విరమణ పొందిన ఉద్యోగులు ఇలాంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, దానయ్య వంటి ఎంతోమంది నాయకులు కృషి వల్ల సిఐటియు బలపడిందని తెలిపారు. కొత్తవారిని తయారు చేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

అల్లూరి జయంతి ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని క్షత్రియ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటపతిరాజు కోరారు. సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలకు సంబంధించి పలు విషయాలపై చర్చించారు. జులై 4వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ ఫెడరేషన్ ఎపి సెక్రటరీ డిఎస్ఎన్.రాజు, క్షత్రియ సంక్షేమ సమితి ప్రెసిడెంట్ డి.తిరుపతిరాజు, సెక్రటరీ డిఎస్‌పి.వర్మ, విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు, ఎమ్మెల్సీలు పి.రఘువర్మ, రఘురాజు, మాజీ ఎమ్మెల్సీ చంటిబాబు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ విరమణ

దేవదత్త పాండే దంపతులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ ఫోర్‌మ్యాన్ దేవదత్త పాండే, స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్లో మెడికల్ అసిస్టెంట్ మోస దానయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

జనరల్ ఫోర్‌మ్యాన్‌గా పాండే విరమణ

విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ ఫోర్‌మ్యాన్ దేవదత్త పాండే పశ్చిమ బెంగాల్‌లోని ఫలక్కా ప్రాంతంలో 1963 మే 22వ తేదీన జన్మించారు. 1980లో మెట్రిక్యులేషన్, 1981-83లలో ఐటిఐ పూర్తి చేశారు. 1984-85 సంవత్సరాలలో డాక్ యార్డులో అప్రెంటిస్‌గా చేరారు. 1987లో స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రెయినీగా జాయిన్ అయ్యారు. 1990లో మద్ది వెంకటలక్ష్మిని వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. అమ్మాయి స్నిగ్ధ పాండే ఎంటెక్ పూర్తి చేసి అమెజాన్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నారు. అబ్బాయి ధీరజ్ పాండే ఎన్ఐటిలో బీటెక్ పూర్తి చేసి వోల్వో కంపెనీలో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

దేవదత్త పాండే 1991 మార్చిలో సిపిఎంలో చేరారు. 1998 నుంచి 2014 వరకు సెక్రటేరియట్ మెంబర్, డివిజన్ కమిటీలోని ఇతర పదవుల్లో పనిచేశారు. 1993 నుంచి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆఫీస్ బేరర్‌గా పనిచేశారు. తర్వాత 11 సంవత్సరాలు ఇంజినీరింగ్ షాప్ అండ్ ఫౌండ్రీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. 2004 నుంచి 2014 వరకు యూనియన్ ట్రెజరర్‌గా పనిచేశారు. 2014 తర్వాత కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2015 నుంచి రెండుసార్లు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ అధ్యక్షునిగా పనిచేశారు. 2022 తర్వాత ఆరోగ్యం సహకరించకపోవడంతో యూనియన్ పనుల్లో చురుగ్గా పాల్గొనలేకపోయారు.

స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి అనేక పోరాటాలను పాండే ముందు నిలబడి నడిపించారు. గతంలో స్టీల్‌ప్లాంట్ బిఐఎఫ్ఆర్ వరకు వెళ్లినప్పుడు, కాంట్రాక్టు కార్మికులు రూ.2100 జీతం కోసం పెద్ద ఎత్తున జరిగిన పోరాటంలోనూ పాండే తనదైన రీతిలో కార్మికులను ఐక్యం చేశారు.

ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, ప్లాంట్ పరిస్థితిపై ఆందోళన వ్యక్తంచేశారు. స్టీల్‌ప్లాంట్‌పై అన్ని వైపుల నుంచి దాడి పెరుగుతుందన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ ఆపేయడంతో ఇబ్బంది కరంగా ఉందన్నారు. భవిష్యత్తు మరింత గడ్డు కాలం కానుందని పేర్కొన్నారు. కొత్తగా చేరిన ఉద్యోగులు వాస్తవాలు తెలుసుకొని సొంత ప్రయోజనాల కోసమే కాకుండా ప్లాంటు భవిష్యత్తు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. 2028 తర్వాత సీనియర్ ఉద్యోగులు పెద్ద ఎత్తున రిటైర్ అవుతారని, ఆ తర్వాత యువత గట్టిగా పోరాడాల్సి ఉంటుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉంటేనే వేతన సవరణ, ఇతర ప్రయోజనాలు ఉంటాయని గుర్తు చేశారు. రూ.4,500 కోట్ల అప్పుల్లో ఉన్నప్పుడు కూడా కార్మికుల ప్రయోజనాలు కాపాడుకున్నామని గుర్తు చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఈ పోరాటాలకు తన మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు.

వైద్య సేవలో దానయ్య

స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్లో సాధారణ అటెండెంట్‌గా చేరి మెడికల్ అసిస్టెంట్‌గా మోస దానయ్య ఉద్యోగ విరమణ చేస్తున్నారు. మోస దానయ్య సిఐటియు నేతృత్వంలో జరిగిన ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారు. పెదగంట్యాడ పరిధి గంగవరం గ్రామంలో రాజయ్య, వెంకయ్యమ్మ దంపతులకు దానయ్య జన్మించారు. మొత్తం ముగ్గురు అన్నదమ్ములు కాగా దానయ్య పెద్ద కుమారుడు. 1986లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసి స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌లో సాధారణ అటెండెంట్‌గా చేరారు. 31 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఆయన సొంతం. విధుల్లో చేరిన నాటి నుంచి సిఐటియు పిలుపునిచ్చిన అన్ని పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1991లో చిట్టిని వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు మహేష్, వినోద్.

1989-90 మధ్యలో డివైఎఫ్ఐ గంగవరం సెక్రటరీగా పనిచేశారు. 1991 డిసెంబర్ తర్వాత సిఐటియు ఏరియా సెక్రటరీగా, మెడికల్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, వర్కింగ్ ప్రెసిడెంట్, సెంట్రల్ కమిటీ ఇన్వైటర్, సెంట్రల్ సేఫ్టీ కమిటీ మెంబర్, సెంట్రల్ మెడికల్ కమిటీ మెంబర్, టౌన్ అడ్మిన్ కమిటీ మెంబర్ తదితర హోదాల్లో పనిచేశారు. 1990 నుంచి ఇప్పటి వరకు సిపిఎంలో కొనసాగారు. అనేక సమ్మెలు, పోరాటాలు జరుగుతున్న క్రమంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి జన సమీకరణ చేశారు. 1995 వేతన ఒప్పందం, స్ప్లిట్ డ్యూటీ, గ్రేడ్ బెనిఫిట్ కోసం కార్మికుల తరపున పోరాడారు. పార్టీ పిలుపునిచ్చిన దాదాపు అన్ని పోరాటాలకు ఆయన తనువంతు సహకారం అందించారు. ముఖ్యంగా సిఐఎస్ఎఫ్ కానిస్టేబుళ్లు కార్మికులపై దాడి చేసినప్పుడు పెద్ద పోరాటం జరిగింది. తర్వాత కరానా సమయంలోనూ జనరల్ హాస్పిటల్ మొదటి పేషెంట్ దానయ్యే. క్యాజువాలిటీలో విధులు నిర్వహిస్తూ అనేక మంది రోగులకు సహాయం అందించారు.

దానయ్య దంపతులు

సమస్యలపై జర్నలిస్టుల ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం నగరంలో పాత్రికేయులు కదంతొక్కారు. ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గాల పిలుపు మేరకు సోమవారం జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ కూడా నిరసన తెలిపి స్పందనలో కలెక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, జీవో 38లో మార్పులు చేసి అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ సదుపాయం కల్పించాలని, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదబీమా కార్డులను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇరోతి ఈశ్వరరావులు, ఎన్.మధుసూదనరావు, జి.శ్రీనివాస్, ఎ.సాంబశివ రావు, బి.సీతారామమూర్తి, వై.రామకృష్ణ, ఎన్.రామకృష్ణ, ఆడారి కొండలరావు, మురళీకృష్ణ, కామన్న, సుజాత మూర్తి, రమణమ్మ, చింతా ప్రభాకరరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేష్, బి.ఈశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, కార్మిక బీమా వర్తింపజేయాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, అవార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.కొండలరావు, పి. రామకృష్ణ, బొడ్డేడ శ్రీనివాసరావు, పి.సురేష్, మధు, పి. సత్యనారాయణ, నాగం నానాజీ, అరిఫ్, షణ్ముక్, దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డిపిఆర్ఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న పాఠశాలల పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-చోడవరం : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఎంఇఒకు సోమవారం శానిటేషన్ కార్మికులు వినతి పత్రం అందించారు. కనీస వేతనం అమలు చేయాలని, హైస్కూళ్లలో పనిభారం పెరుగుతున్నందున అదనంగా వర్కర్లను నియమించాలని, బాత్‌రూమ్ కడగటానికి, స్కూల్ పరిసరాలు శుభ్రం చేయడానికి అవసరమైన పరికరాలు ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు కనీసం సెలవు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనిఫాం, చేతులకు గౌజులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వరలక్ష్మి, శానిటేషన్ వర్కర్లు నర్సియ్యమ్మ, రమణమ్మ, చిన్నమ్ములు, వి.బాల, సంతోషి, దేవి, కుమారి, సంతోషి, శ్యామల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఆహ్వాన నాటికల ప్రదర్శన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జార్జ్ క్లబ్ ఆధ్వర్యాన జూన్ 2 నుంచి 4 వరకు ఆహ్వాన నాటికల ప్రదర్శన నిర్వహిస్తున్నామని జార్జ్ క్లబ్ అధ్యక్షులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జార్జ్ క్లబ్, వైకె నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, ఆది లీల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జార్జ్ క్లబ్ కొణతాల వెంకటనారాయణమ్మ కళా ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 2న సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ యంగ్ మేన్ థియేటర్ ఆర్ట్స్ వారిచే 'ఓ క్రైమ్ కథ', విశాఖపట్నం తెలుగు కళా సమితి వారిచే "నిశ్శబ్దమా నీ ఖరీదెంత" ప్రదర్శితమవుతాయని తెలిపారు. 3న హైదరాబాద్ కళాంజలి వారిచే "రైతే రాజు", గుంటూరు అభినయ ఆర్ట్స్ వారిచే "అతీతం", 4న గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారిచే "నాన్న నేనొచ్చేస్తా", చిలకలూరిపేట అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారిచే "ఆలీతో సరదాగా" హాస్య నాటిక ప్రదర్శించడం జరుగుతుందని వెల్లడించారు. కళాభిమానులు, కళాకారులు, పెద్దలు, విచ్చేసి ఈ నాటికలను తిలకించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జార్జ్ క్లబ్ పాలక వర్గసభ్యులు కోరారు.

యోగా పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ప్రథమ వార్షికోత్సవం అనకాపల్లి జార్జ్ క్లబ్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. యోగా గురువులు దొరమ్మ నాయుడు, మాదేటి జనార్దన్ పర్యవేక్షణలో వివిధ విభాగాల్లో యోగా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు డి.చిన్నబాబు, నాయకులు టిఎస్‌వి.ప్రసాదరావు, బి.ప్రభాకర్‌మూర్తి, ఎం.సత్యనారాయణ, నాగేశ్వరరావు, ప్రభాకర్, బుద్ద రమేష్, పీలా సందీప్, కె హైమ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు 67 మంది హాజరు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రారంభమైన కౌన్సెలింగ్‌కు 67 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్–ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. 35 మంది పురుషులు, 32 మంది బాలికల సర్టిఫికెట్లను పరిశీలించారు. వీరిలో ఓసీలు 12 మంది, బీసీలు 54 మంది, ఎస్సీ ఒకరు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రవేశ ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసరావు



ఎంవిఆర్ దంపతులను పూలమాలలతో సత్కరించిన దృశ్యం

ఘనంగా ఎంవిఆర్ 29వ వివాహ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు దంపతుల 29వ వివాహ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నర్సింగరావుపేటలోని వారి స్వగృహంలో బంధువులు, స్నేహితులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభిమానుల మధ్య అత్యంత కోలాహలంగా పెళ్లిరోజు వేడుకలు జరిగాయి. ఎంవిఆర్ పెద్ద కుమారుడు రాజేష్ దంపతులు, చిన్న కుమారుడు సతీష్ సమక్షంలో కేక్ కటింగ్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. దంపతులను ఎంవిఆర్ యువసేన సభ్యులు, అభిమానులు, శాలువాలతో సత్కరించి గజమాలతో అలంకరించి పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - పరవాడ

జిల్లా ఎస్‌పి కాపారపు వెంకట మురళీకృష్ణ సోమవారం పరవాడ పోలీస్ స్టేషన్లో తనిఖీలు నిర్వహించారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి పరవాడ పోలీస్ స్టేషన్‌కు ఆయన విచ్చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. అన్ని రికార్డులను తెప్పించుకొని పరిశీలించారు. నేరాల సంఖ్య ఎలా ఉంది అనే దానిపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు గురించి ప్రశ్నించారు. స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యాలపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఫార్మా కంపెనీలకు వెళ్లే వాహనాలకు సంబంధించి ట్రాఫిక్ నియంత్రణపై సూచనలు చేశారు. సచివాలయాల మహిళా పోలీసుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పరవాడ సబ్ డివిజన్ డిఎస్పి కెవి సత్యనారాయణ, సిఐ పెదిరెడ్ల ఈశ్వరరావు, ఎస్సైలు సురేష్, మల్లేశ్వరరావు తేజేశ్వరరావు, తదితర పోలీస్ అధికారులు ఎస్పీ అడిగిన ప్రశ్నలకు దగ్గరుండి సమాధానాలు చెప్పారు.

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ఎస్‌కెఆర్ లాడ్జిలో వివాహిత దారుణ హత్య

భర్త ఆత్మహత్యాయత్నం ?



సంఘటనా స్థలంలో మహాలక్ష్మి మృతదేహం

సంఘటనా స్థలంలో శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురంలో ఎస్‌కెఆర్ లాడ్జిలో సోమవారం వివాహిత దారుణ హత్యకు గురైంది. ఆమె భర్త ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక ఎస్‌కెఆర్ లాడ్జిలోని నెంబర్ నెంబర్ 33లో సోమవారం ఉదయం 10 గంటలకు రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెం రైతు భరోసా కేంద్రంలో పనిచేస్తున్న మహాలక్ష్మి, ఆమె భర్త మజ్జి శ్రీనివాసరావు దిగారు. రోజంతా బయటకు రాకపోవడంతో లాడ్జి సిబ్బంది సాయంత్రం చూడగా మహాలక్ష్మి హత్యకు గురై ఉంది. ఆమె భర్త శ్రీనివాసరావు కొనఊపిరితో ఉన్నారు. శ్రీనివాసరావు ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. భర్తే మహాలక్ష్మిని హత్య చేసి, తను ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడా? లేదా ఎవరైనా హత్య చేశారా అనేది విచారణలో తేలాల్సి ఉంది. మహాలక్ష్మి శ్రీనివాసరావు ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల కాలంలో వారి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తుంది. ఎస్‌కెఆర్ లాడ్జిలో హత్య స్థలాన్ని అచ్యుతాపురం సిఐ మురళీధర్‌రావు, ఎస్సై సన్యాసినాయుడు సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పర్యావరణహిత జీవనశైలి అవసరం

ప్రజాశక్తి-అనకాపల్లి : పర్యావరణ హిత జీవనశైలి ఎంతో అవసరమని జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. కాలుష్యం నియంత్రణ మండలి ఆధ్వర్యాన సోమవారం పర్యావరణంపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం రోజువారి లైఫ్ స్టైల్ పర్యావరణాన్ని పాడు చేసేలా ఉందన్నారు. 7 థీమ్ మిషన్ అనగా సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్, ప్లాస్టిక్ నిరుపయోగం, స్వచ్ఛమైన ఆహారం తినడం ద్వారా, రెడ్యూస్ వేస్ట్, ఫ్రిడ్జ్ ఈ వేస్ట్, హెల్తీ లైఫ్‌ను అలవాటు చేసుకోవడం ద్వారా మనం పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి సమక్షంలో జిల్లా అధికారులందరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రోజువారి జీవితంలో సాధ్యమయ్యే అన్ని మార్పులు చేస్తానని, కుటుంబ సభ్యులకు స్నేహితులకు, ఇతరులకు పర్యావరణ అనుకూల అలవాట్లు ప్రాముఖ్యత గురించి తెలియజేయడానికి నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, జెసి జాహ్నవి తదితరులు

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-చోడవరం

అమరావతిలో పేదలకు పంపిణీ చేస్తున్న స్థలాలకు వ్యతిరేకంగా టిడిపి అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్న ఈ ర్యాలీ వెంకన్నపాలెం జంక్షన్ నుండి చోడవరం వరకు వందలాది ద్విచక్ర వాహనాలతో సాగింది. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : పేదల ఇళ్లపై చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో వైసిపి నేతలు సోమవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సిబిఎం కాంపౌండ్ నుండి అబిద్ సెంటర్ మీదగా సీఎంఆర్ షాపింగ్ మాల్ వరకు ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పేదల ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలతో పోల్చి పేదలను అగౌరవపరిచారన్నారు. చంద్రబాబు నాయుడు మహానాడులో మేనిఫెస్టో విడుదల చేసి నిరుద్యోగులకు 3000 ఇస్తానని హామీ ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ 600 హామీలు ఇచ్చి కనీసం 60 హామీలు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. బాబు వస్తే జాబు వస్తుందని నిరుద్యోగులను మోసం చేసిన మోసగాడు చంద్రబాబు నాయుడు అని విమర్శించారు.

నర్సీపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు చింతకాయల సన్యాసి పాత్రుడు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, కార్యకర్తలు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా వేలాడుతున్న విరిగిన చెట్టు కొమ్మలు

రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్టు కొమ్మలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఈదురు గాలులకు రోడ్డుమీద చెట్టు కొమ్ములు విరిగి పడి వాహనాలకు ఇబ్బంది కలుగుతున్నా ఆర్ అండ్ బి అధికారులు ప్రజా ప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆదివారం వీచిన భారీ గాలులకు మండలంలోని గొందుపాలెం గ్రామం సమీపాన ఒకే చోట 5 చెట్లు కొమ్మల వీరికి రోడ్డుకి అడ్డంగా పడ్డాయి. దీంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఆ గ్రామానికి చెందిన కొంతమంది కొద్దిపాటి కొమ్మలను తొలగించి వాహనాలు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. అయినప్పటికీ మిగతా కొమ్మలు తొలగించాల్సినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పడి ఉండగా చిన్నపాటి మార్గంలోనే వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. గత వారంలో వీచిన ఈదురుగాలులకు సూరెడ్డిపాలెం సమీపాన రోడ్డుకు అడ్డంగా చెట్టు పడితే ఏ కోడూరు పోలీసులు స్థానికులు ఆ చెట్టును యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. కానీ గొండు పాలెం గ్రామ పక్కన పడివున్న చెట్లను తొలగించుటకు అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

నెలసరి పరిశుభ్రతపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి అర్బన్ పరిధిలో మొదటి సెక్టార్ అంగన్వాడీ కేంద్రాలలో కిశోర బాలికల సమస్యలపై అవగాహనా కార్యక్రమం సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డిపిఓ ప్రభావతి అధ్యర్యంలో నిర్వహించారు. సూపర్వైజర్ వరలక్ష్మి కిశోర బాలికలు నెలసరి టైంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆరోగ్య విషయంలో ఎటువంటి పోషకాహారం తినాలనే విషయాలపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాల గురించి వివరించారు. సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : సూర్య బలిజ సంఘం అనకాపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం 100 మంది పేద విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ తదితర విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అనకాపల్లి గాంధీ చౌక్ వద్ద జక్కుల శంకరమ్మ నివాసంలో ప్రధాన కార్యదర్శి జక్కుల వెంకటరమణమూర్తి (బాబు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జక్కుల బాలాజీ, పి.గోపాలకృష్ణమూర్తి, కేవీఎన్ రాజు, పత్తి సత్యనారాయణ, మద్దిల సత్యనారాయణ, కే నూకరాజు, జె గణేష్, సంకు కిషోర్, జే సూరిబాబు, జే నాగేశ్వరరావు, జే.రాంబాబు, బి సూర్య అప్పారావు, ఎం లక్ష్మణ్, జే చిట్టిబాబు, డిటిఎస్ విలాస్, జే విశ్వనాథం, కే వేణు, ఎం లక్ష్మణ్, కే నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : నాడు-నేడు పథకం కింద కోటి 61 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగానికి నిధులను కేటాయిస్తూ ప్రజా వైద్యానికి ఎనలేని సేవలు అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్, జెడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు, కొలిమల్ల అచ్చంనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైద్యాధికారుల డాక్టర్ సంధ్య, కిరణ్, స్థానిక నాయకులు కోరుకొండ అప్పలనాయుడు, గంటల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-పరవాడ

మండల కేంద్రమైన పరవాడ ఫార్మాసిటీకి ఆనుకొని ఉన్న స్క్రాప్ దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఫార్మా సంస్థలకు చెందిన కెమికల్ కవర్లు, ప్లాస్టిక్ కవర్లు, ఫైబర్ వంటివి బయటికి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాంకీ ల్యాండ్ ఫిలింగ్‌కు, సిడబ్ల్యుఎంపికి తరలించవలసిన వ్యర్థాలు తుక్కు దుకాణాల్లో కనబడడం రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు ప్రకారంగా కాకుండా రాంకీ యాజమాన్యం చెక్ పోస్ట్‌లు ఇష్టారాజ్యంగా తీసివేసి ఇలాంటి తుక్కు దుకాణ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారని, దీనిపై లోతుగా విచారణ చేయాలని కోరారు. మరోవైపు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న తుక్కు దుకాణాల్లో కనీస భద్రత ప్రమాణాలు, నీటి సౌకర్యం ఏమీ లేకుండా నడుపుతున్నారని, జన జీవనానికి నష్టం వాటిల్లుతుందని, దీనిమీద కూడా సమగ్ర విచారణ చేయాలన్నారు. ప్రమాదం జరిగిన ఘటనపై కేసు నమోదు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే డిపార్ట్‌మెంట్‌లన్నీ నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి కోరారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచ్

గ్రామ కంఠం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని అచ్చర్ల గ్రామం 217 సర్వే నెంబర్‌లో సుమారు 40 సెంట్లు గ్రామ కంఠం భూమి ఆక్రమణకు గురైందని మాజీ సర్పంచ్ పొన్నాడ రాజు సోమవారం ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్ నాయుడుకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఈ భూమిని కొనుగోలు చేసుకున్నారని, వారు నుండి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. వారికి టిడిపి టీడీపీ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కాయల మురళి, నాయకులు ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపికృష్ణ, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, సిదిరెడ్డి సూర్యనారాయణ, కర్రి దుర్గనాయుడు, జెర్రిపోతుల నూకనాయుడు, ఎంపిటిసి షేక్ బాబార్, నిమ్మల గోవింద అచ్చెర్ల గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై నిఘా

ప్రజాశక్తి-అనకాపల్లి : జూన్ 2 నుండి 10వ తేదీ వరకు జరగనున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో ఆయన సమీక్షించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు నిషేధం, పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని, పరీక్షా హాలులో తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, ప్రాథమిక చికిత్స కిట్లు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. మొత్తం 21 పరీక్ష కేంద్రాల్లో 12,000 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, రవాణా శాఖాధికారి వీర్రాజు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- పరవాడ : మండలంలోని నాయుడుపాలెం, ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ పరిధిలో హనుమాన్ నగర్ చేపట్టిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గొన్నా ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ గొన్నా హేమచంద్ నాయుడు రూ.15 వేలు విరాళం సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు, సమ్మంగి అప్పారావు, ఈరుగుల లక్ష్మీప్రసాద్, కిలపర్తి అప్పలనాయుడు పాల్గొన్నారు.

'టిడిపి మినీ మ్యానిఫెస్టోలో అన్ని తరగతులకూ భరోసా'

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ మహానాడులో పార్టీ అధినేత చంద్రబాబు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో అన్ని వర్గాలకు భరోసా కల్పించేలా ఉందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం వస్తే ప్రతి రైతుకు రూ.20వేలు, 18-59 సంవత్సరాల వారికి ప్రతినెల రూ.1500, ఉద్యోగ అవకాశాలు వచ్చే వరకు ప్రతి నెల రూ.3000 చెల్లిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కెకెవి.నారాయణరావు, కడిమిశెట్టి నరసింగరావు, రామకృష్ణ, బొడ్డేడ మురళి, బోడి వెంకట్రావు, కుప్పిలి జగన్ మోహన్ రావు, మళ్ల శివన్నారాయణ, బుద్ద భువనేశ్వరరావు, మొల్లి రమణ, గణపతి బంగారు రాజు, బుద్ద సోమేశ్వరరావు, విల్లూరి సత్తిబాబు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్పందన కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా సమస్యకు నాణ్యమైన పరిష్కారం జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అందిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి స్మరణ్ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించవద్దని పేర్కొన్నారు. స్పందన కార్యక్రమంలో 178 దరఖాస్తులు అందాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనకాపల్లి జిల్లా శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ కొనియాడారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఎండ వేడి తీవ్రంగా వున్న నేపథ్యంలో అనకాపల్లి కలెక్టర్ ఆఫీసు దగ్గర అర్జీదారులకు చల్లని మజ్జిగ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అబ్దుల్ కలాం సేవా సంఘం ఛైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నెహ్రూ చౌక్ జంక్షన్లో కరుణామయుడు ఎంటర్ ప్రైజెస్ యజమాని నగిరి రామారావు సహకారంతో సుమారు 3000 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పాస్టర్ తిమోతి మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన ప్రవీణ్, రామారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో మళ్ళ భోగలింగస్వామి, దయాకర్, రవి, ప్రతాప్, సన్నీ, అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. దీక్షలను ఉద్దేశించి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె బాబూరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లించేలా చట్టం తేవాలని, 11వ పీఆర్సీ, డిఎ ఏరియర్స్ చెల్లించాలని, ఉద్యోగ సంఘాలతో సంప్రదించి 12వ వేతన సవరణ అమలు చేయాలని, ఉద్యోగుల జీపిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ లకు భద్రత కల్పించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు అదే రోజు బెనిఫిట్స్ చెల్లించాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో వివిధ మండలాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మామిడిపాలెం గ్రామంలో జగనన్న అర్బన్ హౌసింగ్‌లో భాగంగా ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ మందపాటి సునీత భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్ కృషితో జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని 82, 83 వార్డుల్లోని మొదటి దశలో 600 కుటుంబాలకు మామిడిపాలెం లే ఔట్‌లో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. వీటిని ఆరు నెలల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కాలనీకి వీఎంఆర్‌డిఎ ద్వారా తాగునీరు, విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి నాణ్యతా లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్, జీవీఎంసీ గృహ నిర్మాణ విభాగం డిఈఈ కె.మధురవాణి, ఏఈ గంటా పింకీ, సచివాలయ అధికారులు అరుణ్ కుమార్, శివ బ్రహ్మాజీ, పార్టీ నాయకులు కోన ఉమ, పేలూరు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-మాడుగుల: గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నామని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. సోమవారం కేజే పురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అనివార్య కారణాలతో ఆగిన వివిధ సంక్షేమ కార్యక్రమాలు తిరిగి కొనసాగించేందుకు ఈ కార్యక్రమం నడుస్తుందన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేయడంతో ధైర్యంగా ఇంటింటికి వెళుతున్నామని తెలిపారు. పరిసర ప్రాంతాలు 15 రోజుల లోపు శుభ్రం చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు, వాలంటీర్, సచివాలయం వ్యవస్థ పని తీరు తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. 8 మంది లబ్ధిదారులకు జగనన్న లే అవుట్ లో ఇళ్ల పట్టాలు అందించారు. అంగన్వాడీ కేంద్రం పరిశీలించి పౌష్టిక ఆహారం పరిశీలించారు. గర్భిణీల సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్తులను పథకాలను అడిగి తెలుసుకుంటున్న బూడి

శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

జోరుగా ప్రారంభాలు.. శంకుస్థాపనలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవంతో పాటు శంకుస్థాపనల్లో సోమవారం స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు, అనకాపల్లి ఎంపీ సత్యవతి పాల్గొన్నారు. రూ.40 లక్షలతో నిర్మించిన కొడవటిపూడి సచివాలయాన్ని , రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని, గొట్టువాడ గ్రామంలో 16 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు, అదేవిధంగా ఎంపీ నిధులతో కోటవురట్ల శివారు గవరపేట 10 లక్షలతో కమ్యూనిటీ హేల్ , తంగేడు, రామచంద్రపురం గ్రామాలలో 5లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం తంగేడు గ్రామం వద్ద స్థానిక సర్పంచ్ శివప్రసాద్ నిర్మించిన విశాఖ సీడ్స్ గోదామును ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, ఎంపీపీ అప్పలనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసిల్దార్ జానకమ్మ, కోటవురట్ల సర్పంచ్ అనిల్ కుమార్, తంగేడు సర్పంచ్ శివప్రసాద్, కొడవటిపూడి సర్పంచ్ అప్పారావు, రామచంద్రపురం సర్పంచ్ చవ్వాకుల కుమారి పాల్గొన్నారు.

నేడు రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి:ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఈనెల 30న మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒక్కరోజు నిరసన రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఉద్యోగుల సంఘం నక్కపల్లి తాలూకా అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, కార్యదర్శి యు వివిఎస్ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం ఎస్ వి ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలో చిన్న గుమ్ములూరు గ్రామంలో మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మాటు వేసి రంగుల అప్పలకొండను అదుపులోకి విచారించగా మద్యం అక్రమంగా తరలించి అధిక రేటుతో అమ్మకానికి తీసుకు వెళుతున్నట్లుగా తెలిపాడు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు.

విత్తనాలకు రైతుల పేర్లు నమోదు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో రాబోయే ఖరీఫ్ సీజన్ కోసం వరి విత్తనాల కోసం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సుధారాణి తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో డబ్బులు చెల్లించి, తమ పేర్లను చేసుకోవాలని ఆమె రైతులను కోరారు. ఆయా రకాల విత్తనాల రేట్ల వివరాల కోసం ఆర్బికే కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

పశువులకు బీమా.. పాడి రైతులకు ధీమా

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్:పాడి పశువులు కొనుగోలు చేయాలంటే భారీ ఎత్తున పెట్టుబడి పెట్టాలి. కొనుగోలు చేసిన పాడిపశువును పెంచే క్రమంలో విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, వ్యాధులు, విద్యుదాఘాతాలు వంటి ప్రమాదాలు జరిగి చనిపోతే పాడి రైతు భారీ ఎత్తున నష్టపోయే అవకాశం ఉంది. ఈ నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని బీమాతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుంది. రైతులు వ్యవసాయం, పాడిపరిశ్రమ పై ఆధార పడి జీవిస్తున్నారు. ఈక్రమంలో జీవాలు మరణిస్తే మరింత నష్టపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం బీమా పథకాన్ని రూపొందించింది. వైఎస్సార్ బీమా పథకం కింద రైతులకు అండగా నిలవనుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. పశువులు, మేకలు, గొర్రెలు వంటి జీవాలకు బీమాను వర్తింపజేయనుంది. 21 రోజుల్లో బీమా పరిహారం చెల్లించడం జరుగుతుంది. లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమ అవుతుంది.

బీమా వర్తింపు:

దేశీయ జాతి పశువులకు రూ.15,000, మేకలు, గొర్రెలు ఒక్కొక్క దానికి 6వేల రూపాయల చొప్పున బీమా వర్తిస్తుంది. ఒక్కొక్క మందలో ఐదు పశువుల వరకు, 50 గొర్రెల వరకు ఈ బీమా వర్తిస్తుంది. పాడి ఆవులు రెండు నుండి పది సంవత్సరాల వయస కలిగి ఉండాలని, లేదంటే ఒక ఈత అయినా ఈని ఉండాలి. గేదెలు మూడు నుండి 12 సంవత్సరాలు, ఎద్దులు ఒకటి నుండి పది సంవత్సరాలు, దేశీయ జాతి రెండు నుండి పది సంవత్సరాలు, గొర్రెలు, మేకలు ఆరు నెలలు వయసు కలిగిన వాటికి ఈ బీమా వర్తిస్తుంది.

బీమా చెల్లించండి ఇలా

ఎస్సీ, ఎస్టీలకు చెందిన రైతులు, తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులు దేశీయ జాతి పశువులకు 3సంవత్సరాలు బీమా కాలం 30 వేల .విలువకు రూ.384 ఇతర వర్గాల వారికి సంకరజాతికి రూ.960 ప్రీమియం చెల్లించి బీమా పొందాలి. ఎస్సీ, ఎస్టీలకు చెందిన గొర్రెలు, మేకలకు మూడు సంవత్సరాలకి రూ.75, ఇతర వర్గాల వారు మూడేళ్లకు 188 రూపాయల ప్రీమియం చెల్లించి ఈ బీమాను పొందవచ్చు . రైతు గరిష్ఠంగా అయిదు పశు వులు, 50 వరకు గొర్రెలు/ మేకలు, 50 పందులకు బీమా చేయించుకునే అవకాశం మాత్రమే ఉంది. ఇది జూన్ నుంచి అందుబాటులోకి వస్తుంది.

రైతులకు మంచి అవకాశం

ఆసక్తి గల రైతులు ప్రతి ఒక్కరూ తమ పాడి పశువులకు బీమా నమోదు చేయించుకోవాలి. పాడి రైతు నష్టపోకుండా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద రైతులు ఆర్థికంగా నష్ట పోకుండా ఉంటారు.

రాంబాబు
పశుసంవర్ధక శాఖ సహాయక సంచాలకులు, నర్సీపట్నం

పొగాకు వ్యతిరేక దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఈ నెల 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల వికాస ఫౌండేషన్ సంస్థ, గాంధీ సెంటర్ రూపొందించిన వరల్డ్ నో టు టొబాకో పోస్టర్‌ను సోమవారం డాక్టర్ ఎల్‌బి కాలేజీలోని గాంధీ సెంటర్‌లో ఆచార్య బాల మోహన్‌దాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్ అధ్యక్షులు బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ, పొగ పీల్చడం ద్వారా ఏటా సుమారు 10 లక్షల మంది చనిపోతున్నారని తెలిపారు. బాల వికాస ఫౌండేషన్ ప్రతినిధి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించడం అత్యవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యమూర్తి, కృష్ణ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య రామకృష్ణారావు, ఆచార్య హరినారాయణ, డాక్టర్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యదేవ్

నింజాస్ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అడ్డ రోడ్‌లోని స్కూల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన సబ్ జూనియర్ పోటీలలో నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన 8 మంది క్రీడాకారులు మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్స్‌ను కె.శార్వాణి , బి.ఎన్. మణికంఠ , పి.ప్రణీత్, ఎమ్.ప్రేమ్ విష్ణేష్ సాధించారు. సిల్వర్ మెడల్‌ను పి.శిరీష, పి.భాను బి.నవ దీప్ సాధించారు. కాంస్య పతకాను సిహెచ్ చరణ్ బాలాజీ సాధించారు. కోచ్ ప్రియాంక, ఆర్గనైజింగ్ కోచ్ రెడ్డి చరణ్, జిల్లా సెక్రటరీ బి.జగదీష్ విజేతలకు మెడల్స్ అందజేశారు.

పారదర్శకంగా రీ సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి -కొత్తకోట:జగనన్న భూ రీసర్వేను పార దర్శకంగా నిర్వహించాలని కొత్తకోట కోపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్ సూచించారు. కొత్తకోట పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం సాయంత్రం జగనన్న భూ రీ సర్వే కార్యక్రమం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్య దేవ్ మాట్లాడుతూ, వంద సంవత్సరాల క్రితం జరిగిన సర్వే తర్వాత నేడు అత్యంత సమగ్రంగా రీ సర్వే చేపడుతున్నారన్నారు ఈ సర్వేతో గ్రామంలో బంజరు భూములు, గ్రామకంఠం, జిరాయితీ, తదితర రెవెన్యూ వివరాలు తెలుస్తాయని చెప్పారు. ముఖ్యంగా పూర్వీకుల నుంచి మనకు సంక్రమించిన భూముల్లో మనం సాగు చేసుకుంటున్నప్పటికీ భూములకు అవసరమైన సంబంధిత రెవెన్యూ రికార్డులు లేకపోవడంతో ఇంతవరకు ఇబ్బంది పడిన రైతులకు ఈ సమగ్ర భూ సర్వేతో యాజమాన్య హక్కు పత్రాలు లభిస్తాయని సత్య దేవ్ వివరించారు. భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చిన్నబ్బాయి వీఆర్వో లక్ష్మీ, సర్వేయర్ శ్రీరామమూర్తి, వైసిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు బేతా పాండు రంగారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిబిరాలు

నర్సీపట్నంలో ధ్యానం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: గ్రంథాలయధికారిని పి దమయంతి ఆధ్వర్యంలో వేసవి శిబిరం నిర్వహించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పిల్లలకు ఫిజికల్ ఫిట్నెస్‌పై అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, విలువలపై వివరించారు.రాజా రామ్ మోహన్ రాయ్ జీవితంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమం 43 మంది పిల్లలతో ఉత్సాహంగా నిర్వహించారు.

గొలుగొండ : వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా గొలుగొండ శాఖ గ్రంథాలయంలో సోమవారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్‌పై వివరించారు.జనరల్ నాలెడ్జ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాజబాబు, రిసోర్స్ పర్సన్ విశ్వనాధుని రాజబాబు పాల్గొన్నారు.

కోటవురట్ల:శాఖ గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో డాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు, మస్తాన్ మాస్టారు మాట్లాడుతూ, విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవాలని సూచిం చారు.

గొలుగొండలో..

ములగాడ : మల్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో చిన్నారుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా జాతీయ సేవా పథకం వాలంటీర్ లావణ్య సోమవారం నాట్యంలో శిక్షణ ఇచ్చారు. చిన్నారులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, కార్మిక నాయకులు బి.సత్యానందం పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి శాఖ గ్రంథాలయంలో 22వ రోజు వేసవి శిక్షణ శిబిరంలో కథలు రాయటం, చదవటం, చెప్పడం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన ఫొటో ఫ్రేమ్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు కర్రి సత్యనారాయణ విద్యార్థులకు సులువైన పద్ధతిలో లెక్కలు నేర్పించారు. రైతు -ముగ్గురు కుమారుల కథను డైట్ టీచర్ వజీదా చెప్పారు. డిగ్రీ విద్యార్థి జబీనా యాస్మిన్ ఫొటో ఫ్రేమ్ తయారీ, నాట్య గురువు ఎవి.శార్వాణిదేవి కూచిపూడి నృత్యాన్ని నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

ఉప్పుటేరులో పూడిక తీయించాలి

- మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట ఉప్పుటేరులో పూడికతీత తీయించి, నీరు నిల్వ ఉండేటట్లు చేసి, చేపలు పెంచి ఉపాధి కల్పించాలని మత్స్యకారులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. ఉప్పుటేరులో పూడికతీత తీయించి, ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయం సిబ్బంది సుదర్శన్, కన్నబాబు లకు వినతిపత్రం అందజేశారు. రాజయ్యపేట గ్రామం సర్వే నెంబర్ 291లో 400 ఎకరాలు ఉప్పుటేరు ఉందన్నారు. వేట నిషేధ సమయంలో నీరు ఉన్న సమయంలో ఉప్పుటేరులో రాజయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు వేట చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవడం జరుగుతుందన్నారు. ఉప్పుటేరులో మట్టి పేరుకుపోవడంతో నీరు నిల్వ ఉండటం లేదని, దీంతో వేట చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుండి జూన్ 15 వరకు వేట నిషేధ కాలంలో ఉప్పుటేరులో వేట చేసుకుని ఉపాధి పొందే విధంగా ఉప్పుటేరును అభివృద్ధి చేయాలని కోరారు. ఉప్పుటేరులో సుమారు పది అడుగుల లోతు పూడికతీత తీయించి నీరు నిల్వ ఉండే విధంగా పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు మామిడి నానాజీ, గోసల సోమేశ్వరరావు, చేపలు సోమేష్, బొంది నూకరాజు, వాసుపిల్లి నూకరాజు, పిక్కి కోటి, మైలపల్లి దాద్రాజు, మైలపల్లి బాపూజీ పాల్గొన్నారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న నాయకులు

రీ సర్వేతో రైతులకు మేలు

ప్రజాశక్తి రావికమతం: మండలంలోని గొంపలో జగనన్న భూ రక్ష- ఓ హక్కు పథక సర్వే కార్యక్రమాన్ని సర్పంచ్ కంట్రేడ్డి గోవిందు ప్రారంభించారు. ఇంతకుముందు డ్రోను సహాయంతో సర్వే నిర్వహించగా దానికి సంబంధించిన మ్యాప్ ప్రకారం క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే సిబ్బంది సర్వే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న భూ హక్కు- భూ రక్ష సర్వే కార్యక్రమాన్ని గ్రామంలో పక్కగా నిర్వహించాలని ఆయన సూచించారు. సర్వే నిర్వహించి పక్కా రికార్డులతో పాస్‌పుస్తకాలను రైతాంగానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు మెంబర్లు, కార్యకర్తలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు

ప్రజాశక్తి-పెదబయలు:మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంతలో పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సెంట్రైన్స్ స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొంది. ప్రయాణికులకు ప్రమాదం కలగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు. మోదకొండమ్మ జాతర నేపథ్యంలో భక్తుల రద్దీతో ప్రమాదాలు జరగకుండా పోలీసులు చూడాలని స్థానికులు కోరుతున్నారు.

జివిఎంసి కార్మికుల టోకెన్ సమ్మె

▶▶ విశాఖలో భారీ ర్యాలీ ▶▶ జూన్ 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరిక

విశాఖలో భారీ ర్యాలీ చేపడుతున్న నాయకులు, పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

జివిఎంసి పారిశుధ్య విభాగంలో 482 పోస్టుల భర్తీలో కార్మికుల వారసులకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నప్పటికీ అధికారులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సోమవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె నిర్వహించారు. సమ్మెలో పాల్గొన్న వందలాది మంది కార్మికులు జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని, అక్కడ నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్పందనలో జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, కార్యదర్శి పి.మణి, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు అనిల్ కుమార్, పి.సురేష్, యుజిడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇ.ఆదినారాయణ, ఎం.ఈశ్వరరావు, రత్నం, సత్యవతి, గణేష్, శంకర్ రెడ్డి తదితరులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి, కెఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ జివిఎంసి పారిశుధ్య విభాగంలో 482 పోస్టుల భర్తీలో కార్మికుల వారసులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లు, మలేరియా, వెటర్నరీ, నీటి సరఫరా, యుజిడి, పార్కుల్లో పనిచేసే కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే జూన్ 19 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో పారిశుధ్య కార్మికులు ఎంతటి అకుంఠిత దీక్షతో పనిచేశారో వివరించారు. ఆ సమయంలో 18 మంది చనిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 25 ఏళ్లకుపైగా ప్రజలకు సేవలు అందించిన పారిశుధ్య కార్మికులు రిటైర్ అయినా, ప్రమాదంలో అంగవైకల్యం చెందినా, చనిపోయినా ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం అందడం లేదన్నారు. అటువంటి కార్మికుల వారసులకు చెందాల్సిన డెత్, రిటైర్డ్, లాంగ్ ఆబ్సెంట్ పోస్టుల్లో వారి పిల్లలకు ఎందుకు ఉపాధి కల్పించరని ప్రశ్నించారు. ఇప్పటికే 482 పోస్టులు ఖాళీలు అయితే వారి పిల్లలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జివిఎంసి స్క్రూట్నీ కమిటీ ఫైనలైజ్ చేసిన 316 పోస్టులకుగాను 77 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు కమిషనర్ చెప్పడం సరైనదికాదన్నారు. ఇప్పటికే 300 మందిని టెంపరరీ పేరుతో వేసుకున్నారన్నారు. వీరు టెంపరరీ అయితే పర్మినెంట్ కార్మికుల వలే ఫేషియల్ రీడింగ్ ఎలా తీస్తారని ప్రశ్నించారు. పోస్టులు అమ్ముకుంటున్నారని సిఐటియు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే ఎందుకు విచారణ జరపలేదన్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా ఎందుకు వర్క్ ఆర్డర్ ఇచ్చారని ప్రశ్నించారు. సిఎం బంధువులమని చెప్పుకుంటున్న క్లాప్ కాంట్రాక్టర్లు బ్రోకర్ల ద్వారా డ్రైవర్ల నుంచి వసూలు చేసిన డిపాజిట్ డబ్బులను తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ లేబర్ కమిషనర్ ఆదేశాలను అమలుచేయాలని కోరారు. సమస్యలపై పోరాడుతున్న కార్మిక నేత పి.వెంకటరెడ్డి గొంతు నొక్కడానికి తప్పుడు కేసులు పెట్టడం, అవినీతి ఆరోపణలు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ ప్రకారం వాల్వ్ ఆపరేటర్లకు, ఎలక్ట్రికల్, పెట్రోల్ హెల్పర్లకు, పార్కుల గార్డెనర్లకు సెమీస్కిల్డ్ వేతనం రూ.18500 చెల్లించాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జనాభా విస్తీర్ణం ఆధారంగా సిబ్బందిని పెంచి నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. అనంతరం కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

అనకాపల్లిలో మాట్లాడుతున్న బాలకృష్ణ

భీమునిపట్నం : జివిఎంసి పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, వెటర్నరీ, యుజిడి, నీటి సరఫరా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన భీమిలి జోనల్ కార్యాలయం ఎదుట ఆయా విభాగాల కార్మికులు టోకెన్ సమ్మె నిర్వహించారు. అనంతరం కార్యాలయం సూపరింటెండెట్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాకు ముందు గంట స్తంభం నుంచి జోనల్ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, కార్యదర్శి రవ్వ నరసింగరావు, నాయకులు రామకృష్ణ, రమణ, అంజిబాబు, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి:జివిఎంసి పరిధిలో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లు, పారిశుధ్య కార్మికులు సోమవారం ఒక రోజు టోకెన్ సమ్మె చేశారు. ఇందులో భాగంగా జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని ఆరు నెలలుగా ఆందోళన చేస్తున్నా పరిష్కరించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమం క్లాబ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు శివ, సంతోష్, రాము, అజయ్, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

విఓఎల ఆందోళన

నక్కపల్లిలో ఆందోళన చేస్తున్న విఓఎలు

ప్రజాశక్తి -నక్కపల్లి:వెలుగు యానిమేటర్లు (విఓఏ)లు తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన బాట పట్టారు. సోమవారం వెలుగు కార్యాలయం వద్ద తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్.ఆర్ పాలసీ అమలు, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, విఓ ల మెర్జ్ అపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని విఓఎలు డిమాండ్ చేశారు. లోకో యాప్ వర్క్ కోసం 5 జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలని, 15 సంఘాల లోపు ఉన్న విఓఏ లకు వేతనాలు చెల్లించి, మెర్జ్‌తో ఉపాధి కోల్పోయిన విఓఏ లకు నష్ట పరిహారం చెల్లించాలని, వయస్సు, చదువు, జెండర్ పేరుతో విఓఏల తొలగింపు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సూర్యనారాయణ, కార్యదర్శి సత్యనారాయణ, వరలక్ష్మీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో వెలుగు కార్యాలయం వద్ద సోమవారం వెలుగు వివోఏలు ధర్నా నిర్వహించారు. వయసు, చదువు, జెండర్ పేరుతో తొలగించడం సరికాదని విఓఎలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు మాణిక్యం మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత కల్పించాలని, 15 సంఘాలు ఉన్న వివోఏలకు సైతం వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రవణమ్మ, వివోఏలు పాల్గొన్నారు.

పరవాడలో...

కోటవురట్లలో ఆందోళన చేస్తున్న విఓఎలు

పరవాడ :వెలుగు విఓఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట వివోఏలు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వివోఏ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం ఉమా, పి.రమ మాట్లాడుతూ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 15 సంఘాల లోపు ఉన్న వివోఏల వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, వెంకటలక్ష్మి, నీలిమ, నాగమణి, పైడి లక్ష్మి, విజయ పాల్గొన్నారు.